బడ్జెట్ కాదిది.. అరచేతిలో వైకుంఠం

రాష్ట్ర బడ్జెట్ అంతా అరచేతిలో వైకుంఠంలా ఉన్నది. రూ.2,91,000 కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆరు గ్యారంటీలు, 420 హామీల అమలుపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. రైతులు, ఉద్యోగులు, కార్మికులు, నిరుద్యోగులు, మహిళలు, కుల వృత్తిదారులకు, విద్యారంగానికి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు తీవ్ర అన్యాయం చేశారు. వరి ధాన్యానికి రూ.500 బోనస్ సంగతే మరిచారు. పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది. భట్టి బడ్జెట్ ప్రసంగంలో గత ప్రభుత్వాన్ని తిట్టడానికి, బదనాం చేయడానికే ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు.

- భూమోళ్ల కృష్ణయ్య, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

రైతు భరోసా ఊసే లేదు

తెలంగాణ ప్రభుత్వం గురువారం అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. కేటాయించిన బడ్జెట్‌లో ఎస్సీల అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించలేదు, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సీల కోసం భారీగా నిధులను కేటాయించేది. కాని కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీలను విస్మరించింది. ఎస్సీల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు ఇచ్చిఉంటే బాగుండేది. రాజ్యాంగంలో సూచించిన నియమావళి ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక నిధులను కేటాయించాల్సి ఉంటుంది. కాని అలా కేటాయింపు ఎక్కడా కనిపించడంలేదు.

- మంబిపల్ వెంకట్, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి, కులకచర్ల

ఎస్సీల అభివృద్ధికి నిధులు నిల్

బడ్జెట్‌లో రైతు భరోసా ఊసు లేకపోవడం దారుణం. ఎన్నికలకు ముందు పంట పెట్టుబడి కింద రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి.. అధికారంలోని రాగానే రైతు భరోసాకు చరమ గీతం పాడారు. భరోసా నిధులు రుణమాఫీకి మళ్లించారు. కనీసం బడ్జెట్‌లోనైనా కేటాయిస్తారనుకుంటే ఆడి ఆశలు చేశారు. ఇక మాకు అప్పులు చేయడమే గతి. రైతులపై ఎంతో ప్రేమ ఉన్నట్లు నటిస్తూనే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు పంటలకు రైతు బంధు అందిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క పంటకు కూడా రైతు బరోసా ఇవ్వకపోవడం దురదృష్టకరం.

- రాజు, రైతు, కెరెళ్లి గ్రామం, ధారూరు మండలం

సీల్డ్ టెండర్ల స్వీకరణ

వికారాబాద్, జూలై 25 : వికారాబాద్ జిల్లాలోని వెల్ఫేర్, రెసిడెన్షియల్ స్కూల్స్, బీసీ, ఎస్సీ, ఎస్‌డబ్ల్యూ హాస్టళ్లకు, గిరిజన, టీడబ్ల్యూ, కేజీబీవీ మైనార్టీ, అంగన్‌వాడీ పాఠశాలలకు మౌలిక వస్తువుల సరఫరాకు డీలర్ల నుంచి సీల్డ్ టెండర్లను కోరుతున్నట్లు డీఆర్‌డీవో శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్యాన్లు (2000), 20 వాట్ల బాల్టన్ డే లైట్లు (800), ఎల్ఈడీ లైట్లు, 100 వాట్ల ఎల్ ఈడీ హాలోజన్ లైట్లు (320), స్టీల్ ఫ్రేమ్‌లతో కూడిన గాల్వనైజ్డ్ ఎంఎస్ డోర్లు (800) సరఫరా కోసం డీలర్ల నుంచి సీల్డ్ టెండర్లను కోరుతున్నట్లు చెప్పారు. దరఖాస్తు ఈ నెల 26 నుంచి 30 సాయంత్రం 5 గంటల వరకు వికారాబాద్ జిల్లా గ్రామీణాభివృద్ధి కార్యాలయం నుంచి టెండర్ ఫారాలు పొందాలని పేర్కొన్నారు. దరఖాస్తులను జిల్లా గ్రామీణాభివృద్ధి కార్యాలయంలో ఈ నెల 31న మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమర్పించాలని సూచించారు. డీఆర్‌డీవో, డీఆర్‌డీఏ, వికారాబాద్ జిల్లా పేరుపై డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీ) ప్రతి టెండర్ దరఖాస్తుకు రూ.5వేలు చెల్లింపు చేయాలన్నారు. ఈ నెల 31న సాయంత్రం 4 గంటలకు ఏజెన్సీల సమక్షంలో జిల్లా కల్లెక్టరేట్ సమావేశ మందిరంలో టెండర్లు తెరవనున్నట్లు ఆయన వివరించారు.

కనీస వసతులు కరువు

- సమస్యల నిలయంగా వికారాబాద్
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ ఫోరం ప్రతినిధులు

వికారాబాద్, జూలై 25 : వికారాబాద్ పేరుకే జిల్లా కేంద్రం, కనీస వసతులకు కూడా నోచుకోవడం లేదని వికారాబాద్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ ఫోరం ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం వీడీడీఎఫ్ అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రతినిధులు మారుతి, దేవదాస్, విజయ కుమార్, మాణిక్‌రెడ్డి, తిరుపతిరెడ్డి వికారాబాద్ సమస్యలపై కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధాన, అంతర్గత రోడ్లు గుంతలమయంగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రధాన చౌరస్తాల్లో సిగ్నల్స్, సీసీ కెమెరాలు లేవని, ట్రాఫిక్ పోలీసులు కూడా ఉండడం లేదని తెలిపారు. చిన్నపాటి వర్షం పడ్డా ప్రధాన రోడ్లపై మురుగునీరు చేరుతున్నదని, మురికినీటి కాలువల వ్యవస్థ సరిగ్గా లేదని అసహనం వ్యక్తం చేశారు. వీధి దీపాలు కూడా సరిగ్గా లేవని, ఉదయం 4 గంటల నుంచి వాకర్స్ ముఖ్యంగా మహిళలు చీకట్లోనే వాకింగ్‌కు వెళ్లాల్సి వస్తున్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో కుక్కల బెడద ఎక్కువైందని, ప్రజలు తమ పిల్లలను బయటికి పంపడానికి భయపడుతున్నారన్నారు. ప్రధాన రోడ్లలో డివైడర్‌లు లేక వన్ వే విధానం అమలు కావడం లేదని, రోడ్లపై ఉన్న చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపించి రోడ్లపై జరిగే వ్యాపారాలను నియంత్రించాలని పేర్కొన్నారు. వికారాబాద్‌ను జిల్లా కేంద్రంగా గుర్తించాలంటే ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. మున్సిపల్, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల అధికారులను పిలిపించి సమస్యలకు పరిష్కారం చూపాలని వారు కలెక్టర్‌ను కోరారు. వివిధ మండలాల నుంచి జిల్లా కేంద్రానికి వచ్చే రోడ్లు దశాబ్దకాలంగా రిపేర్లకు నోచుకోక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆ రోడ్ల మరమ్మతుకు కూడా చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్‌ను కోరారు.

పలు శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

ఈ-ఆఫీసుతో కార్యకలాపాలు

- రంగారెడ్డి కలెక్టర్ శశాంక
- జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం

రంగారెడ్డి, జూలై 25 (నమస్తే తెలంగాణ) : ప్రతి శాఖలో ఈ-ఆఫీసు ద్వారా కార్యకలాపాలు చేపట్టాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. గురువారం రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ ఈ-ఆఫీసు నిర్వహణపై జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా అధికారులందరూ మొత్తం ఫైళ్లను ఈ ఆఫీస్ ద్వారానే పంపాలని సూచించారు. ఈ ఆఫీస్ ద్వారా ఫైళ్లను పంపేందుకు ప్రతీ శాఖ అలవాటు చేసుకోవాలని, అవసరమైన కంప్యూటర్ పరిజ్ఞానాన్ని ఏర్పర్చుకోవాలన్నారు. ఇందుకుగాను ప్రతి శాఖ అవసరమైన సామగ్రి సమకూర్చుకోవాలన్నారు. రాబోయే రోజులన్నీ సాంకేతిక పరిజ్ఞానం పైనే ఆధారపడి ఉంటాయని.. అందువల్ల ప్రతి శాఖలో ఈ-ఆఫీసు ద్వారా కార్యకలాపాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. శాఖలవారీగా లాగిన్లు పెండింగ్‌లో లేకుండా త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, మత్స్య, పంచాయతీరాజ్, ఉద్యానవన, మహిళా శిశు సంక్షేమ, మైనార్టీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, మెప్మా తదితర శాఖల్లో బల్క్ ఇ మెయిల్ ఐడీలను క్రియేట్ చేసుకోవడానికి అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటివరకు ఐడీలు క్రియేట్ చేయకపోతే.. త్వరితగతిన ఏర్పాటు చేసుకుని కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానంతో అధికారులంతా ట్రైనింగ్ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి గురువారం నవాబుపేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఎస్పీ పోలీసు సిబ్బందితో కలిసి స్టేషన్ ఆవరణపై సీఐ, ఎస్ఐని ఆరా తీశారు. అనంతరం పలు రికార్డులను తనిఖీ చేశారు. స్టేషన్‌కు వచ్చిన ప్రతి ఫిర్యాదును కూడా పరిశీలించాలన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు. - నవాబుపేట, జూలై 25

15 ఏండ్లలోపు పిల్లలందరికీ జేఈ వ్యాక్సిన్ వేయాలి

వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పాల్వన్‌కుమార్

వికారాబాద్, జూలై 25 : 15 సంవత్సరాలలోపు పిల్లలందరికీ మెదడు వాపు వ్యాధి నివారణకు జేఈ వ్యాక్సిన్ వేయాలని వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పాల్వన్‌కుమార్ తెలిపారు. గురువారం వికారాబాద్ మండల పరిధిలోని సిద్దులూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జేఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలోని 22 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మెదడు వాపు వ్యాధి నివారణకు జేఈ వాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

నవాబుపేట, మోమిన్‌పేట్, పట్లూరు, బంట్వారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక సంవత్సరం నుంచి నాలుగు సంవత్సరాల లోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో, 5 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాల లోపు పిల్లలకు పాఠశాలల్లో వ్యాక్సిన్ వేయబడుతుందన్నారు. ఈ కార్యక్రమం ఆగస్టు 15 వరకు నిరంతరంగా కొనసాగుతుందని తెలిపారు. తల్లిదండ్రులందరూ వారి పిల్లలకు వ్యాక్సిన్ వేయించి పిల్లలు మెదడు వాపు వ్యాధికి గురికాకుండా జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జేఈ వ్యాక్సినేషన్‌ను పర్యవేక్షిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పాల్వన్‌కుమార్

పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలి

వికారాబాద్ జిల్లా వ్యవసాయాధికారి గోపాల్

బషీరాబాద్, జూలై 25 : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు అనుగుణంగా పంటల్లో యాజమన్య పద్ధతులు పాటించాలని వికారాబాద్ జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ రైతులకు సూచించారు. గురువారం మండల పరిధిలోని నీళ్లపల్లి, ఇస్మాయిల్ పూర్, మర్పల్లి గ్రామాల్లో పర్యటించి రైతుల పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పంట పొలాల్లో వర్షపు నీరు నిలువకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షం ఆగిన తరువాత వారం రోజులు గడిస్తేనే గాని పంట స్థితిగతులు తెలువదని, వర్షాలు తగ్గగానే తొందరపడి ఎరువులు ఎక్కువ మోతాదులో వాడకూడదన్నారు. వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించాలని తెలిపారు. రైతులు వేసుకున్న పంటలను తప్పని సరిగా ఏఈవోల వద్ద పంట నమోదు చేసుకోవాలన్నారు. రుణమాఫీ, రైతు బీమా పథకాల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతు బీమా పథకం ప్రారంభమైందని ఆగస్టు 5వ తేదీ వరకు తుది గడువని పేర్కొన్నారు. బీమాలో మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశం జూలై 30 ఉందన్నారు. అనంతరం కాశీంపూర్ రైతు వేదికలో మండల ఏఈవోలతో సమావేశం నిర్వహించి రైతు బీమా, పంట నమోదు వివరాలను గడువులోగా పూర్తి చేయాలని, రైతులకు అందుబాటులో ఉండాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఏడీఏ రుద్రమూర్తి, ఏఈవోలు ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న డీవో గోపాల్

నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి

- రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్
- గున్‌గల్ ఫారెస్ట్‌లో వనమహోత్సవం మొక్కల పరిశీలన

గున్‌గల్ అటవీ ప్రాంతంలో మొక్కలు నాటుతున్న అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్

యాచారం, జూలై 25 : వనమహోత్సవం కార్యక్రమం ద్వారా నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. మండలంలోని గున్‌గల్ ఫారెస్టులో వనమహోత్సవం కార్యక్రమం ద్వారా అటవీశాఖ ఆధ్వర్యంలో నాటిన మొక్కలను ఆమె గురువారం పరిశీలించారు. మొక్కల పెంపకం తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులతో కలిసి ఆమె ఫారెస్టులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రతిమాసింగ్ మాట్లాడుతూ.. వనమహోత్సవం కింద నాటిన మొక్కలను సంరక్షించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. గున్‌గల్ ఫారెస్టులో వనమహోత్సవం కార్యక్రమం ద్వారా అటవీశాఖలో 110 ఎకరాల్లో 1.60 లక్షల మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని ఆమె అటవీ శాఖ అధికారులకు సూచించారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శాఖలవారీగా కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. మండలంలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించి, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కృషి చేయాలన్నారు. మండలంలో వనమహోత్సవం టార్గెట్‌ను పూర్తి చేయాలన్నారు. మొక్కల పెంపకం నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించొద్దని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి, డివిజన్ అటవీశాఖ అధికారి వేణుమాదవ్, ఇబ్రహీంపట్నం రేంజ్ ఆఫీసర్ విష్ణువర్ధన్‌రెడ్డి, డీఆర్వో ఇంద్రసేనారెడ్డి, సెక్షన్ ఆఫీసర్ నరసింహ ఉన్నారు.

తన్నుతూ.. ఈడ్చుకెళ్లారు..

చేవెళ్లటౌన్/చేవెళ్ల రూరల్, జూలై 25 : చేవెళ్ల ట్రాఫిక్ పోలీసులు ఓ వాహనదారుడిపట్ల అమానుషంగా ప్రవర్తించారు. చేవెళ్లలోని శంకర్‌పల్లి రోడ్డులో బుధవారం చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం, కానిస్టేబుల్ శ్రీను, హోంగార్డు కేశవ్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ వాహనదారుడికి పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో రెచ్చిపోయిన సీఐ, కానిస్టేబుల్, హోంగార్డు అతడిని చితకబాదారు. నోటికొచ్చినట్లు తిడుతూ కాళ్లతో తన్నుతూ వాహనదారుడిని ఈడ్చుకెళ్లారు. ఈ సంఘటనకు సంబంధించి వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి సీఐ, కానిస్టేబుల్, హోంగార్డులపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నిరుద్యోగ ఎస్సీ యువతకు వెహికల్ డ్రైవింగ్ శిక్షణ

షాబాద్, జూలై 25 : రంగారెడ్డి జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల(ఎస్సీ) నిరుద్యోగ యువకులకు డ్రైవింగ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్(డి.టి.ఐ), టి.ఎ.జెడ్.ఎస్.టి.సి. హకీంపేటలో లైట్ మోటర్ వెహికిల్, హెవీ మోటర్ వెహికిల్ డ్రైవింగ్ శిక్షణ 38 రోజులు ఇవ్వనున్నట్లు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వహక సంచాలకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ తర్వాత పర్మినెంట్ లైసెన్సు ఇప్పించనున్నట్లు చెప్పారు. శిక్షణలో అవసరమైన భోజనం, వసతి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. శిక్షణకు 20 సంవత్సరాల వయస్సు పైబడిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల యువకులు రంగారెడ్డిజిల్లా కలెక్టర్ కార్యాలయం 2వ అంతస్తులోని ఎస్-9, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జిరాక్స్, రేషన్ కార్డు(ఫుడ్ సెక్యూరిటీ కార్డు)జిరాక్స్, మూడు పాస్ పోర్టు సైజు ఫొటోలు, ఆధార్ కార్డు జిరాక్స్ అందజేయాలన్నారు. హెవీ మోటర్ లైసెన్సు శిక్షణలో చేరేవారు లైట్ మోటర్ డ్రైవింగ్ లైసెన్సు జారీ కాబడి ఒక సంవత్సరం కాలం దాటి ఉండాలన్నారు. ఆ జిరాక్స్‌లను దరఖాస్తుకు జత చేయాలన్నారు. ఎల్ఎంబీ డ్రైవింగ్ శిక్షణ కోసం ఎల్ఎంవీ లర్నింగ్ లైసెన్స్ జిరాక్స్, హెచ్ఎంవీ డ్రైవింగ్ శిక్షణ కోసం హెచ్ఎంవీ లర్నింగ్ లైసెన్స్ జిరాక్స్ జత చేయాలన్నారు.

ఇంటర్ స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్

మొయినాబాద్, జూలై 25 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల ఇంటర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో మిగిలిపోయిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్ కౌన్సింగ్ శుక్రవారం నిర్వహించనున్నట్లు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా పశ్చిమ ప్రాంతీయ సమన్వయాధికారి డాక్టర్ శారదావెంకటేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలల్లో మిగిలి ఉన్న ఖాళీల భర్తీ కోసం బాలికలకు మొయినాబాద్ మండల పరిధిలోని తోలుకట్టా గ్రామ సమీపంలోని చేవెళ్ల గురుకుల బాలికల కళాశాలలో స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఆదేశాలకు అనుగుణంగా మార్చి 2024లో 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2 లక్షలు (అర్బన్ ప్రాంతంలో), గ్రామీణ ప్రాంతంలో ఉండేవారి వార్షిక ఆదాయం 1.50 లక్షలు కలిగి ఉండాలని తెలిపారు. 2024 ఆగస్టు 31 నాటికి 17 సంవత్సరాలు నిండి ఉండాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్‌కు వచ్చే విద్యార్థులు 10వ తరగతి మార్కుల ధ్రువీకరణ పత్రం, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో తోలుకట్టా గ్రామంలోని ఎస్‌వీ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఉన్న చేవెళ్ల గురుకుల కళాశాలకు రావాలని చెప్పారు.

వివిధ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 25: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ డిప్లొమా ఇన్ కలినరీ ఆర్ట్స్ రెండో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును వచ్చే నెల 2లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రెండేండ్ల ఎంసీఏ (సీబీసీఎస్) రెండు, నాలుగో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును వచ్చే నెల 6లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని ఆయన సూచించారు.

దూరవిద్య పీజీ కోర్సుల పరీక్షా తేదీల మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా అందించే వివిధ పీజీ కోర్సుల పరీక్షా తేదీలను మార్చినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ మొదటి, రెండో సంవత్సర పరీక్షలను ఆగస్టు 13 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.

సీజనల్ వ్యాధుల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

- మున్సిపల్ అధికారులు నిత్యం ఫీల్డ్ విజిట్ చేయాలి
- రంగారెడ్డి కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, జూలై 25 (నమస్తే తెలంగాణ) : సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పారిశుధ్యం, సీజనల్ వ్యాధులు, వనమహోత్సవం, వీధి కుక్కలకు శస్త్ర చికిత్సలు, మున్సిపల్ పరిధిలో అసంపూర్తిగా మిగిలిన పనులపై మున్సిపల్ కమిషనర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలోని మున్సిపల్ పరిధిలో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో నివాసం ఉంటున్న కుటుంబాలను గుర్తించాలన్నారు. వర్షాకాలంలో తాగునీరు కలుషితమై సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలిన ప్రాంతాలను అధికారులు సందర్శించి వ్యాధులు రావడానికి గల కారణాలను తెలుసుకుని వైద్యాధికారులతో సమన్వయం చేసుకుని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మున్సిపల్ అధికారులు తమ పరిధిలోని పాఠశాలలు, కమ్యునిటీహాళ్లు, రెసిడెన్షియల్ హాస్టళ్లు, కాలనీలలో నీటి నిల్వలు లేకుండా, దోమల బెడద లేకుండా చూడాలన్నారు. ప్రతి మున్సిపల్ కమిషనర్ ఉదయం 7 గంటలకే ఫీల్డ్ విజిట్‌లో ఉండి, శానిటరీ సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. కాలనీల్లో వీధి కుక్కల బెడద లేకుండా రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా వివిధ ఏజెన్సీలతో ఒప్పందం చేసుకుని వీధి కుక్కలకు శస్త్ర చికిత్సలు చేయించాలన్నారు. జిల్లాలో మహిళలు మహిళా శక్తి ద్వారా ఆర్థికంగా బలోపేతం కావడానికి సంఘాలలోని మహిళలను ఎంపిక చేయాలని కలెక్టర్ సూచించారు. వనమహోత్సవంలో భాగంగా కాలనీల్లోని గేటెడ్ కమ్యూనిటీ, వెల్ఫేర్ అసోసియేషన్, కాలనీవాసులను భాగస్వాములు చేసి ప్రతి ఇంటికీ మొక్కలను అందజేయాలన్నారు. మొక్కలను విరివిగా నాటి లక్ష్యాలను అధిగమించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, అటవీశాఖ అధికారులు, పీడీ మెప్మా, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పరిగి పట్టణంలో గురువారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు జరిపి రూ.30వేల విలువ చేసే నిషేధిత గుట్కాలు, కాలం చెల్లిన పల్పీ ఆరేంజ్ జ్యూస్, సోడా బాటిల్స్, వాటిర్ బాటిల్స్‌ను పట్టుకున్నారు. పట్టణంలోని గణేష్ ట్రేడర్స్‌లో గురువారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ పోలీసులు భాస్కర్ రాథోడ్, రాంచందర్, బాలు దాడులు జరిపారు. వాటిని పరిగి పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ కృష్ణ తెలిపారు. - పరిగి, జూలై 25

పార్లమెంట్‌లో బషీరాబాద్ సమస్యలపై ప్రస్తావన

బషీరాబాద్, జూలై 25 : చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బషీరాబాద్ సమస్యలపై పార్లమెంట్‌లో ప్రస్తావించారు. మండల కేంద్రం (నవాంద్గీ రైల్వే స్టేషన్)లో పలు ట్రైన్‌లు నిలపాలని ప్రసంగంలో కోరారు. ట్రైన్‌లు నిలుపడంతో విద్యార్థులు, ఉద్యోగులు, సామాన్యులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. సమస్యలపై పార్లమెంట్‌లో ప్రస్తావించడంతో మండలవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

రీవాల్యూయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఓయూ, జూలై 25 : ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా అందించే ఎంసీఏ పరీక్షా ఫలితాల రీవాల్యూయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసీఏ నాలుగో సెమిస్టర్ మెయిన్, మొదటి, రెండు, మూడో స